వేధిస్తున్న లో ఓల్టేజీ సమస్య

- ప్రారంభానికి నోచుకోని సబ్‌స్టేషన్
- తరచూ మరమ్మతులకు గురవుతున్న మోటార్లు
- ఇబ్బందుల్లో రైతులు, ప్రజలు



నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని సబ్‌స్టేషన్

గుంతకల్లు రూరల్: విద్యుత్ సరఫరాలో లో ఓల్టేజీ కారణంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించే క్రమంలో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టి ఎన్నికలకు ముందు నిర్మాణ పనులను కూడా పూర్తి చేసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఇంతవరకూ సబ్ స్టేషన్ ప్రారంభంపై అటు అధికారులు గానీ, ఇటు ప్రజా ప్రతినిధులు గానీ దృష్టి సారించకపోవడంతో ప్రజలు, రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుంతకల్లు మండలంలోని ఓబుళాపురం, మైనాపురం, మైనాపురం తండా, కొంగనపల్లి, శంకరబండ, మొలకలపెంట, మొలకలపెంట తండా గ్రామాలకు పాతకొత్తచెరువు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. గ్రామాల సంఖ్య ఎక్కువగా ఉండడంతో.. ఈ లైన్‌పై లోడ్ అధికంగా ఉండటంతో ప్రజలు, రైతులు గత పది సంవత్సరాలుగా తీవ్రమైన లో ఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. లో ఓల్టేజీ సమస్య కారణంగా పొలాల్లోని మోటార్లు, గ్రామానికి నీటిని సరఫరా చేసే పంచాయతీ మోటార్లు తరచూ కాలిపోతుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతూవచ్చారు. దీంతో గ్రామాల్లో కరెంటు సమస్యతో పాటు, నీటి కష్టాలు అధికమవుతూవచ్చాయి. ఈ క్రమంలో 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆయా గ్రామాల ప్రజలు, రైతులు అప్పటి ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరించాలంటూ మొరపెట్టుకున్నారు. వెంటనే స్పందించిన వైవీఆర్ సమస్యను పరిష్కరించే క్రమంలో భాగంగా నూతన సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడమే కాకుండా, పాతకొత్తచెరువు సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేక విద్యుత్ లైన్ ద్వారా ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు చేపట్టారు. 33–11కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి అనుమతి మంజూరు చేసిన ప్రభుత్వం అందుకు అవసరమైన నిధులను సైతం మంజూరు చేసింది. ఓబుళాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ అభిమాని మహిళా రైతు సంకమ్మ తన పొలంలో 1.25 ఎకరాలను సబ్ స్టేషన్ నిర్మాణానికి విరాళంగా అందజేశారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన సబ్ స్టేషన్ నిర్మాణపు పనులను చేపడుతూ సకాలంలో పూర్తి చేశారు. సబ్‌స్టేషన్ ప్రారంభించే సమయానికి ఎన్నికల నగారా మోగడంతో ప్రారంభోత్సవం ఆగిపోయింది.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తయినా ఇంతవరకూ సబ్‌స్టేషన్‌ను మాత్రం ప్రారంభించిన పాపాన పోలేదు. దీంతో లోఓల్టేజీ సమస్య కారణంగా రైతులు పడే ఇబ్బందులు అంతకంతకూ పెరుగుతూనే వస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించేందుకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేసినప్పటికీ రోజురోజుకూ ఆ లైన్‌పై మోటర్ల సంఖ్య పెరుగుతుండడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. సమస్యను అధిగమించే క్రమంలో విద్యుత్ శాఖ అధికారులు అర్ధరాత్రి సమయంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేయడం మొదలుపెట్టారు. ఆ సమయంలో పొలాలకు వెళ్లి పంటకు నీరుపెట్టే రైతులు చీకటిలో ఎప్పుడు ఏంజరుగుతుందోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ కాలాన్నీ వెల్లదీస్తున్నారు. లో ఓల్టేజీ సమస్యతో రైతులు భారీ ఎత్తున ఇబ్బందులు పడుతున్నా, సమస్యను పరిష్కరించే నూతన సబ్‌స్టేషన్ కళ్లెదుటే ఉన్నా దాన్ని ప్రారంభించే విషయంలో మాత్రం కూటమి ప్రభుత్వం మీనమేశాలు లెక్కిస్తుంది. దీంతో రైతులతోపాటు, ప్రజలు లోఓల్టేజీ సమస్యతో అవస్థలు పడుతూనే వస్తున్నారు.

మోటార్లు కాలిపోతున్నాయి



లోఓల్టేజీ సమస్య రైతులను వేధిస్తుంది. ఈ సమస్యతో ఎన్నిసార్లు మోటర్లు కాలిపోయాయో లెక్కేలేదు. లో ఓల్టేజీ కారణంగా విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు నష్టపోయాం. గత ప్రభుత్వంలో నూతనంగా సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టినా ఇప్పటివరకూ దాన్ని ప్రారంభించిన పాపాన పోలేదు. దీంతో మా సమస్యలు ఎప్పుడు పరిష్కారం అవుతాయో తెలియడం లేదు.

– జయరామిరెడ్డి, రైతు, ఓబుళాపురం

ప్రభుత్వం స్పందించాలి



లోఓల్టేజీ సమస్యను పరిష్కరిచాలన్న ఉద్దేశంతో మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కొత్త సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయించారు. అంతవరకూ రైతులు ఇబ్బంది పడకూడదని ప్రత్యేకంగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేయించారు. సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయి ఏడాది అయినా ఇంతవరకూ ప్రారంభానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే సమస్య కొనసాగుతుంది.

– హనుమంతు, వైఎస్సార్‌సీపీ మండల వైస్ కన్వీనర్, మొలకలపెంట

అర్ధరాత్రి కరెంట్‌తో ఇబ్బంది



విద్యుత్ శాఖ అధికారులు వ్యవసాయానికి అర్ధరాత్రి, అపరాత్రి తేడా లేకుండా కరెంటు ఇస్తున్నారు. దీంతో భార్య, పిల్లలను ఇళ్లలో వదిలేసి రాత్రి సమయాల్లో పొలంలోనే ఉండాల్సి వస్తుంది. ఇన్నాళ్లు అర్ధరాత్రి కరెంటు ఇచ్చిన విద్యుత్ శాఖ అధికారులు, ఇప్పుడు ఉదయం నాలుగు గంటలకు ఇస్తున్నారు. సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి ఏడాది పూర్తయినా ప్రారంభించకపోవడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు.

– హనుమేష్, రైతు, కొంగనపల్లి

ఎస్‌ఎస్ ట్యాంకును హంద్రీ–నీవా జలాలతో నింపాలి



కసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు వద్ద నిరసన చేపడుతున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు రూరల్: కసాపురం గ్రామ సమీపంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకును హంద్రీ–నీవా జలాలతో నింపాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ నాయకుల బృందం చెన్నప్పకొట్టాల గ్రామంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కసాపురం గ్రామంతోపాటు, ఆంజనేయస్వామి ఆలయానికి, దోసలుడుకి, సంగాల గ్రామాల తాగునీటిని సమకూర్చే క్రమంలో భాగంగా 2001లో చెన్నప్పకొట్టాల వద్ద ఎస్‌ఎస్ ట్యాంకు నిర్మాణం చేపట్టారన్నారు. తుంగభద్ర జలాల నిలిపివేతతో ట్యాంకు నిర్వహణను పూర్తిగా మరచిపోయారన్నారు. ట్యాంకును హంద్రీ–నీవా జలాలతో నింపే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్నారు. గతంలో ఈ నిర్ణయంపై మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. ఈ విషయంపై అర్జీ ఇవ్వగా కలెక్టర్ సానుకూలంగా స్పందించి వెంటనే పనులు చేపట్టాలని ఆర్డీఓను ఆదేశించారన్నారు. కానీ ఆర్డీఓ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం మేల్కొని కసాపురం ఎస్‌ఎస్ ట్యాంకును హంద్రీ–నీవా జలాలతో నింపే పనిని చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

కుక్కల బెడద అరికట్టండి



కౌన్సిల్ మీట్‌లో మాట్లాడుతున్న నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: పట్టణంలో కుక్కల స్వైరవిహారం చేస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. కుక్కల బెడద నుంచి పురప్రజలను కాపాడాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ భవానీ అధ్యక్షతన సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. నైరుతిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రి లెక్కల ప్రకారమే ప్రతి నెలా సుమారు 150 మంది కుక్కకాటు బాధితులు ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయించుకుంటున్నారు. కుక్కల బెడద నివారణకు చర్యలు చేపట్టడంలో మున్సిపల్ అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆమె ప్రశ్నించారు. కుక్కల సంఖ్య పెరగకుండా గర్భనిరోధక శస్త్ర చికిత్సలను చేయించడంతో పాటు ప్రజలకు రక్షణ కల్పించేందుకు తగు చర్యలు వెంటనే చేపట్టాలని ఆమె కోరారు. అలాగే ఫిల్టర్‌బెడ్స్‌ను, ఓవర్‌హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయించి ప్రజలకు శుద్ధమైన తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. కమిషనర్ నయీమ్ అహ్మద్ మాట్లాడుతూ కుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు త్వరలోనే చర్యలు చేపడుతామన్నారు. కౌన్సిలర్ చెన్నమ్మ మాట్లాడుతూ దోనిముక్కల రోడ్డుకిరువైపులా డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. కౌన్సిలర్ సుమోబాషా మాట్లాడుతూ పోర్టర్స్‌లైన్‌లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముస్లిం శ్మశానవాటికకు కేటాయించిన స్థలంలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. టీడీపీ కౌన్సిలర్ కృపాకర్ మాట్లాడుతూ కుక్కల బెడద గురించి ఎన్నిసార్లు చెప్పినా అధికారుల్లో చలనం లేదని అసహనం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా వార్డుల్లో అభివృద్ధి పనులు చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టి పనులు ముందుకు సాగేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. టీడీపీ కౌన్సిలర్ పవన్‌గౌడ్ మాట్లాడుతూ వీధివ్యాపారులతో గెజిట్‌కు విరుద్ధంగా సుంకం వసూలు చేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అజెండాలో పొందుపరిచిన అంశాలతో పాటు ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ కౌన్సిల్ తీర్మానం చేసింది. సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సహకార బ్యాంకు తనిఖీ

తాడిపత్రి రూరల్: పట్టణంలోని సహకార బ్యాంకును జిల్లా చైర్మన్ ముండిమడుగు కేశవరెడ్డి గురువారం తనిఖీ చేశారు. బ్యాంకు లావాదేవీలు, రికవరీలు, అప్పులు, బ్యాంకు రుణాలు తదితర వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. బ్యాంకు అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలు, సూచనలను అందజేశారు.

దరఖాస్తుల స్వీకరణ

పుట్లూరు: మండలంలోని పుట్లూరు, ఎ.కొండాపురం గ్రామాల్లో ఆశా కార్యకర్త ఖాళీల భర్తీ కోసం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వైద్యాధికారి శ్రీవాణి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పుట్లూరు, అరకటివేముల సచివాలయాల పరిధిలో ఉన్న 10వ తరగతి ఉత్తర్ణీత సాధించి, 25– 45 మధ్య వయస్సు లోపు ఉన్న మహిళలు ఈ నెల 30న సాయంత్రం 2 గంటల్లోపు దరఖాస్తులను పుట్లూరు పీహెచ్‌సీలో అందజేయాలన్నారు.

ఎద్దులపల్లిలో తహసీల్దార్ పర్యటన

పామిడి: మండలంలోని ఎద్దులపల్లిలో గురువారం తహసీల్దార్ సీ షర్మిల పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన రీ సర్వేపై రైతులతో మాట్లాడారు. తహసీల్దార్ వెంట రీ సర్వే డీటీ సురేఖ, ఆర్‌ఐ గాయత్రి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడికి నివాళి

తాడిపత్రి రూరల్: స్వాతంత్య్ర సమరయోధుడు సహజ సహజనంద సరస్వతి 75వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ఏపీ రైతు సంఘం నాయకులు నివాళులర్పించారు. పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమాల్లో పాల్గొని మార్గదర్శకుడిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చిన్నప్ప యాదవ్, కార్మికసంఘం అధ్యక్షుడు రంగయ్య, ఉపాధ్యక్షుడు వెంకటరాముడు, పట్టణ కార్యదర్శి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఈఓగా శశికళ



యాడికి: జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు గురువారం యాడికి మేజరు పంచాయతీ ఈఓగా మండల ఈఓఆర్డీ శశికళ అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈనెల 14న ఈఓ అశ్వర్థ నాయుడు పామిడి మండలానికి బదిలీ అయ్యారు. ఈ క్ర మంలో ఆమెకు బాధ్యతలు అప్పగించారు.

కారును ఢీకొన్న ఐచర్

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో 44వ జాతీయ రహదారిపై గురువారం కారు, ఐచర్ వాహనం ఢీకొంది. ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి రోహిత్, సుప్రిత దంపతులు గార్లదిన్నె మండలం కల్లూరులో భారతీయ స్టేట్ బ్యాంకులో పని నిమిత్తం కారులో వచ్చారు. బ్యాంకులో పని ముగించుకొని అనంతపురం వైపు వెళ్లేందుకు అంబేడ్కర్ సర్కిల్ వద్ద రోడ్డు దాటుతుండగా ఐచర్ వాహనం ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జైంది. కారులో ఉన్న దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

‘స్థానికులకే అవకాశం కల్పించాలి’

గుంతకల్లు: కడప హెచ్‌పీసీఎల్ డిపో నుంచి ఇంధనం తరలించే అవకాశం స్థానికులకే (ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కాకుండా) అవకాశం కల్పించేలా ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని స్థానిక హెచ్‌పీసీఎల్ ట్రాన్స్‌పోర్టర్స్ కాంట్రాక్టర్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గుంతకల్లులో ఉన్న హెచ్‌పీసీఎల్ డిపోకు రైల్వే మార్గం విద్యుత్ హైటెన్షన్ వైర్లు పోతున్న దృష్ట్యా భద్రత చర్యల్లో భాగంగా కడపకు హెచ్‌పీసీఎల్ డిపోను తరలించారు. దీంతో స్థానికంగా ఉండే వందలాది మంది ట్యాంకర్ ఓనర్లు, డ్రైవర్లు, క్లీనర్లుకు కడప హెచ్‌పీసీఎల్ డిపో నుంచే వివిధ ప్రాంతాలకు ఇంధన సరఫరా చేసే వాళ్లం. అయితే ఇటీవల టెండర్లుకు పిలవడంతో తమిళనాడుకు చెందిన కాంట్రాక్టర్లు దరఖాస్తు చేసుకున్నారు. ఈ టెండర్లు వారికి దక్కితే తాము రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. అంతేకాకుండా రూల్ ప్రకారం తమిళనాడుకు చెందిన ట్యాంకర్స్ ఆంధ్రలో లోడ్ చేయడం కానీ..అన్‌లోడ్ చేయడం కానీ చేయకూడదని నిబంధన ఉందని గుర్తు చేశారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని అసోసియేషన్ నాయకులు ఆంజి, లారీ రమేష్, శివ, ఎర్రిస్వామి, భీమలింగ, నిజాం తదితరులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.

నేడు వాహనాల వేలం

పెద్దపప్పూరు: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ గురువారం తెలిపారు. వేలంలో పాల్గొను వారు ఆధార్ కార్డు, పాన్ కార్డు జిరాక్స్‌లతో పాటు రూ.1,000 డిపాజిట్ చెల్లించాలన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ నాశనం



గుంతకల్లులో ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్‌పీఎఫ్‌లు, ప్రయాణికులు

గుంతకల్లు/గుంతకల్లు టౌన్/గుత్తి/పామిడి/తాడిపత్రి టౌన్/యాడికి/పెద్దపప్పూరు/శింగనమల/గార్లదిన్నె: మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనమవుతుందని, డ్రగ్స్, గంజాయి ఇతర మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఎస్పీ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని జిల్లా బాలల పరిరక్షణ సమితి, ఆర్‌పీఎఫ్‌ల ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ రహిత సమాజం..సంక్షేమానికి సంకేతం అనే నినాదంతో ప్రతిజ్ఞ నిర్వహించిన అనంతరం ర్యాలీ చేపట్టారు. మాదక ద్రవ్యాలు వినియోగించడం ద్వారా కలిగే అనర్థాలను ప్రయాణికులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం.వెంకట్వేరీ, ఆర్‌పీఎఫ్ సీఐ వసంతరావు, ఎస్‌ఐ తిరుమల లక్ష్మీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే గుంతకల్లులో పోలీసు, ఎక్సైజ్, అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది విద్యార్థులతో కలిసి పొట్టిశ్రీరాములు సర్కిల్ నుంచి గాంధీచౌక్ వరకు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఆర్డీఓ శ్రీనివాస్, డీఎస్పీ శ్రీనివాస్, ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, సీఐలు మనోహర్,మస్తాన్, ప్రవీణ్, ఎస్‌ఐలు, సిబ్బంది, ఎక్సైజ్, అగ్నిమాపకశాఖ అధికారులు, ఎన్‌జీఓ ప్రతినిధులు, వివిధ కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు.

- గుత్తిలో నిర్వహించిన ర్యాలీలో సీఐ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, సీఐ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, ఎక్సైజ్ సీఐ ఉమాదేవి, ఎక్సైజ్ సీఐ ఉమాదేవి,ఎస్‌ఐలు గోపాల్, అస్లాం బేగ్, సీఈఓ శ్రీరాములు, శ్రీసాయి డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- పామిడిలో నిర్వహించిన ర్యాలీలో తహసీల్దార్ సీ షర్మిల, ఎంపీడీఓ తేజోత్స్న, సీఐ యుగంధర్, ఎక్సైజ్ సీఐ ఉమాదేవి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుభద్రమ్మ, పీడీ రామకృష్ణ, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- తాడిపత్రి పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి, మున్సిపల్ కమిషనర్ శివరామక్రిష్ణ, సీఐలు సాయిప్రసాద్, శివగంగాధర్‌రెడ్డి, ఎంఈఓ నాగరాజు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధ్యాపకులు, విలేకరులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.
- యాడికికిలో నిర్వహించిన ర్యాలీలో తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, ఎంపీడీఓ వీర్రాజు, ఎస్‌ఐ వెంకటరమణ, ఎంఈఓ కాశెప్ప, ఏపీఎం చంద్రశేఖర్, ఏపీఓ మద్దిలేటి, ఈఓపీఆర్డీ శశికళ, సచివాలయ సిబ్బంది, వెలుగు కార్యాలయం, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.
- పెద్దపప్పూరులో నిర్వహించిన ర్యాలీలో ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్, తహసీల్దార్ బాలాజీరాజు, ఎంపీడీఓ శకుంతల, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
- శింగనమలలో నిర్వహించిన ర్యాలీలో తహసీల్దార్ శేషారెడ్డి, సీఐ కౌలుట్లయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ భాస్కర్, ఎస్‌ఐ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సూర్య ప్రతాప్, ఎంఈఓ నరసింహరాజు, ఏపీఎం ఈశ్వరయ్య, ఎఎస్‌ఐ చితంబరయ్య, ఏఓ నాగభూషణరెడ్డి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- గార్లదిన్నెలో నిర్వహించిన ర్యాలీలో ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా,ఎంఈఓలు చంద్రనాయక్, వెంకటరమణ నాయక్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

అర్హులందరికీ పరిహారం



రోడ్డు విస్తరణ పనులపై ఆరా తీస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు

పుట్లూరు: అర్హులందరికీ పరిహారం అందజేస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ ఎక్విజిషన్) మల్లికార్జునుడు తెలిపారు. మండలంలోని ఎ.కొండాపురంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్డు విస్తరణ పనుల కోసం భూముల సేకరణ, ఆస్తుల నష్టం జాబితాలో ఉన్న 27 మంది లబ్ధిదారులకు రూ.2.86కోట్ల పరిహారం అందించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ శేషారెడ్డి ఆయనకు వివరించారు. పరిహారం జాబితాలో తప్పిదాలు లేకుండా చూడాలని, మరోమారు జాబితాను పరిశీలించాలన్నారు. అనంతరం లబ్ధిదారుల జాబితాను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీక్లబ్ కార్యవర్గం ఏకగ్రీవం..



మాట్లాడుతున్న అధ్యక్షుడు సుధీర్ కార్వా

గుంతకల్లుటౌన్: రోటరీ క్లబ్ పట్టణ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం రోటరీక్లబ్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. రోటరీక్లబ్ అధ్యక్షుడిగా సుధీర్ కార్వా, కార్యదర్శిగా రవికుమార్, ప్రధాన కార్యదర్శి శిరీష్‌కుమార్, కోశాధికారిగా జి.శ్రీనివాసులుతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. రోటరీసభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో గ్రామీణ, పట్టణ ప్రాంతంలో విద్య, వైద్యాభివృద్ధికి చేపట్టబోయే కార్యక్రమాలతో పాటు ఇతర సామాజిక సేవలను అధ్యక్షుడు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు కందూరి సునీత, కార్యదర్శి పాలమాడ జ్యోతి, రొటేరియన్లు శివానంద, కేదార్నాథ్, రామాంజినేయులు పాల్గొన్నారు.

సీలింగ్ ఫ్యాన్ల వితరణ



ఈఓ వాణికి ఫ్యాన్‌లను అందజేస్తున్న దాతలు

గుంతకల్లు రూరల్: తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలోని నార్సింగ్ గ్రామానికి చెందిన సామ సురేందర్ రెడ్డి దంపతులు గురువారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి 32 సీలింగ్ ఫ్యాన్లు, 6 ఎల్‌ఈడీ బల్బులను అందజేశారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేరున అర్చకులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దాతలకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని విరూపాక్షి రెడ్డి కల్యాణ మండపంలో గురువారం లయన్స్ క్లబ్ గుత్తి, లయన్స్ క్లబ్ పోర్టు, రైల్వే శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మంది రోగులను బెంగుళూరు శంకర్ నేత్రాలయ వైద్యులు పరీక్షించారు. మరో 85 మందికి షుగర్ పరీక్షలు నిర్వహించారు. 55 మంది కంటి జబ్బు రోగులను ఆపరేషన్ల కోసం రెఫర్ చేశారు. 54 మంది వృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి విరూపాక్షి రెడ్డి, సీనియర్ డీఎంఎ ప్రమోద్, లయన్స్ క్లబ్ సభ్యులు రిలయన్స్ బాషా, చిన్ని, శ్రీనా, వెంకప్ప, హేమలత పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

శింగనమల: మండలంలోని ఇరువెందల ప్రాథమిక పాఠశాలలో ఎనిమిది సంవత్సరాలు పనిచేసిన ఉపాధ్యాయుడు సాంబశివుడును గురువారం గ్రామస్తులు సన్మానించారు. గ్రామస్తులు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలు నుంచి విద్యార్థులను పోటీ పరీక్షలకు తయారు చేశారని, 15 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారన్నారు. అనంతరం ఆయనతో పాటు తోటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భవాని, కౌన్సిలర్లు

గుంతకల్లుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాచాలని కోరుతూ కౌన్సిల్‌లో తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని తెలిపారు. గురువారం సమ్మెలో భాగంగా ఆఫీసు ఎదుట రిలే దీక్షా శిబిరాన్ని చైర్‌పర్సన్‌తోఆపటు వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, కౌన్సిలర్లు కృపాకర్, పవన్‌గౌడ్ తదితరులు సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక జేఏసీ కార్యదర్శి మల్లేష్, సహాయ కార్యదర్శి సురేంద్ర తదితరులు కౌన్సిల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

‘పొలానికి దారి చూపండి’

యాడికి: మా పొలానికి పోయే దారిలో ఓ రైతు పంట సాగు చేసి దారి లేకుండా చేశాడని, న్యాయం చేయాలని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డికి గురువారం ఓ రైతు వినతి పత్రం అందజేశాడు. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తూట్రాళ్లపల్లిలో రైతు నాగిరెడ్డికి 402 ఎఫ్‌లో భూమి ఉంది. పక్క పొలం రైతు శంకర్ రెడ్డి తమ పొలానికి రోడ్డు లేకుండా చేశాడన్నాడు. తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ వీఆర్వో, గ్రామ రీ సర్వే అధికారుల ద్వారా న్యాయం చేస్తానన్నారు.

నట్టల నివారణపై ప్రత్యేక దృష్టి

పెద్దవడుగూరు: మేకలు, గొర్రెలకు తరచూ వచ్చే నట్టల వ్యాధి నివారించడానికి ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెటర్నరీ డాక్టర్ రమేష్ తెలిపారు. గురువారం పెద్దవడుగూరులో గొర్రెలకు నట్టల మందు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకలకు మందు వేయడం వలన కడుపులోని నులి పురుగులు నశించి జీవాల ఎదుగుదల బాగుంటుందన్నారు. జూలై 10 వరకూ మండలంలోని గొర్రెలు, మేకలకు మందు వేస్తామన్నారు. గొర్రెల కాపర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సత్యనారాయణ, పశువైద్య సచివాలయ సిబ్బంది, గొర్రెల కాపర్లు పాల్గొన్నారు.

పామిడి సీహెచ్‌సీలో అరుదైన శస్త్ర చికిత్స

పామిడి: పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం ఇంగుయినల్ హెర్నియాకు వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి సక్సెస్ అయ్యారు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పీ కొండాపురానికి చెందిన జమ్మక్క ఇంగుయినల్ హెర్నియా వ్యాధితో బాధపడేది. ఈ వ్యాధి నయం కోసం పలు ఆసుపత్రులకు తిరిగినా ఫలితం శూన్యం. దీంతో చివరికి ఆమె పామిడి సీహెచ్‌సీని ఆశ్రయించింది. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ వీ పాల్ రవికుమార్ మార్గదర్శకంలో ఆస్పత్రి వైద్యాధికారి జీ శివకార్తీక్‌రెడ్డి పర్యవేక్షణలో శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ కమలాధర్ ఆధ్వర్యంలో అనస్థీషియా నిపుణుడు డాక్టర్ రాఘవేంద్రరెడ్డి, సర్జికల్ టీమ్ హెడ్ నర్స్ శివకుమారి, ఓటీ అసిసెంట్లు అంజినప్ప, ధనుంజయ బృందం ఈ ఆపరేషన్ విజయవంతంగా చేశారు. ఇందుకు బాధిత జమ్మక్క కుటుంబసభ్యులు శస్త్ర చికిత్స వైద్యబృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



మట్లాడుతున్న ఎంపీపీ విశాలాక్షి

గుత్తి రూరల్: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి సర్పంచ్‌లు కృషి చేయాలని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి సూచించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం గుంతకల్లు డివిజన్ పరిధిలోని ఏడు మండలాల మహిళా సర్పంచ్‌లకు గ్రామాల అభివృద్ధిపై శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను ప్రజలు సర్పంచ్‌ల దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరించాలన్నారు. డీఎల్‌డీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ మాట్లాడుతూ మహిళా సర్పంచ్‌లు తరచూ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి బాలికలకు మంచి చెడు వివరించాలన్నారు. అలాగే మహిళలపై అఘాయిత్యాలు జరిగినట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధి, ఆదాయంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పామిడి ఎంపీడీఓ తేజోత్స్న, ఈఓఆర్డీ నరశింహరెడ్డి, శిక్షకులు పాల్గొన్నారు.

పెన్సనర్ల సంఘానికి విరాళం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పెన్సనర్ల సంఘానికి తాడిపత్రి పట్టణానికి చెందిన రిటైర్డ్ వార్డెన్ క్రిష్టయ్య రూ.10వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.